సాక్షి
నంద్యాల
మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



కన్నడిగుల సందడి

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం కన్నడిగులు మహానందికి భారీగా తరలివస్తున్నారు. తిరిగివెళ్తూ తమ ఆడపడుచులు, అల్లుళ్లకు చాటలు, పట్టుడు కర్రలు కొనుగోలు చేస్తున్నారు.



అలరించిన కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న అధ్యాత్మిక ప్రవచనం (కన్నడ), భజన, యక్షగానం, సంప్రదాయనృత్య ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి.



శాస్త్రోక్తంగా..

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో పంచపర్వ అమావాస్య ఉత్సవంలో భాగంగా సోమవారం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామిని పంచామృతాలతో అభిషేకించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:40
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:43
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:37
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:38
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:38

హదీస్ వెలుగు :

పవిత్ర రంజాన్ మాసం నేర్పిన ఆధ్యాత్మికత, ఓర్పు, సహనం, దానధర్మాలు, ఆకలి దప్పికల నియంత్రణ పాఠాల స్ఫూర్తిని ఇతర నెలల్లోనూ కొనసాగించండి. – పవిత్ర ఖురాన్

హే భగవాన్!



సూర్యుడు ఉదయిస్తూనే సుర్రుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. 12 గంటలు దాటితే తారెత్తిస్తున్నాడు. భగభగమంటూ కర్ఫ్యూ విధిస్తున్నాడు. ఏప్రిల్ మొదటి వారంలోనే జిల్లాలో అత్యధికంగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో భయపడుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఓ వైపు పండగలు, వేడుకలు, మరో వైపు ఎన్నికల ప్రచారం ఉండటంతో ప్రజలు బయటకు రావాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సి వస్తోంది.

- సుర్రుమంటున్న సూరీడు
- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా చాగలమర్రిలో 45.8 డిగ్రీలు నమోదు
- మండే ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి
- వడదెబ్బతో నలుగురు మృతి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

కోవెలకుంట్ల/చాగలమర్రి: 'దేవుడా.. ఇవేమి ఎండలు'.. అనేలా భానుడు భగభగమంటున్నాడు. ఆకాశంలో నిప్పుల కుంపటి పెట్టినట్లుగా ఎండలు మండుతున్నాయి. నంద్యాల జిల్లాలో రోజూ నిప్పుల వర్షం కురుస్తోంది. ఈనెల 7వ తేదీ ఆదివారం రాష్ట్రంలో అత్యధికంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత చాగలమర్రిలో నమోదైంది. ఎండలు, వడగాల్పుల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాధారణంగా ఏప్రిల్ నెల మొదటి వారంలో 41–42 డిగ్రీల వరకే ఉష్ణోగ్రతలు ఉంటాయి. కానీ ఈ ఏడాది సాధారణం కంటే 3–4 డిగ్రీలు మేర ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు కావడంతో జనం విలవిలలాడుతున్నారు. ఇక మే నెలలో ఉష్ణోగ్రతలు ఏ స్థాయికి చేరుతాయోనని భయపడుతున్నారు. గతేడాది జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ప్రస్తుతం ఎండలు పెరిగేందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లాలో బనగానపల్లె, డోన్, పాణ్యం, గోస్పాడు, కొలిమిగుండ్ల, నందికొట్కూరు, శ్రీశైలం, మిడుతూరు మండలాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండల తీవ్రత ఉన్నా సాయంత్రానికి అకాల వర్షాలు పడటం, గాలుల వల్ల కాస్త ఉపశమనం లభించేది. ఈ సారి ఆకాశం నిర్మలంగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా నేలను తాకుతున్నాయి. ఇందువల్ల వడగాల్పుల తీవ్రత రెట్టింపు అవుతోంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు మండిపోతుండటంతో జనంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే హడలి పోతున్నారు.

జనం ఉక్కిరిబిక్కిరి

ఎండ తీవ్రతతోపాటు వడగాల్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇదే సమయంలో రంజాన్ పవిత్ర మాసం వచ్చింది. తీవ్రమైన ఎండలు ఉన్నా ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్నారు. ఉగాది, శ్రీరామ నవమి, వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో షాపింగ్ సైతం పట్టణాలకు ఎండల్లోనే వెళ్లాల్సి వస్తోంది. ఎన్నికల వేళ నాయకులు ప్రచారాన్ని సాయంత్రం ఐదు గంటల తర్వాతనే ప్రారంభిస్తున్నారు. బోరు బావుల కింద వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు తెల్లవారుజామున వెళ్లి ఉదయం 11 గంటలకు ఇళ్లకు చేరుతున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం...

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలో ఏసీలకు తోడు కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరిగింది. చాలా మంది కొత్తవి కొనుగోలు చేస్తుండటంతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో రేట్లు కూడా అధికంగా పలుకుతున్నాయి.


తాటి ముంజలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

చల్లని వ్యాపారం..

ఎండలు అధికం కావడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలవైపు పరుగులు పెడుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా మజ్జిగ, లస్సీ, చెరుకురసం, కూల్‌డ్రింక్స్, తదితర పానీయాలకు భలే గిరాకీ ఉంది. మజ్జిగ, లస్సీ, చెరుకురసం వంటి పానీయాల కోసం ఎగబడుతున్నారు. చిన్న పిల్లలు ఐస్‌క్రీం, కూల్‌డ్రింక్స్ తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో తాటిముంజలకు భలే గిరాకీ ఏర్పడింది. ఆయా ప్రాంతాల్లో డజన్ రూ. 100 ప్రకారం విక్రయిస్తున్నారు.

ప్రాణాలు తీస్తున్న వడగాల్పులు

వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల కారణంగా ప్రజలు వడదెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో నలుగురు మృత్యువాత పడ్డారు. పాములపాడు, పాణ్యం మండలంలో పింఛన్ కోసం వెళ్లి ఇద్దరు, శ్రీశైలంలో కర్ణాటక భక్తుడు, కోవెలకుంట్ల మండలంలో ఓ మహిళ వడదెబ్బతో మృతి చెందారు. వడదెబ్బతో డీహైడ్రేషన్ సాధారణంగా సంభవిస్తాయి. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. తీవ్ర తలనొప్పి, తల తిరగడం, నాలిక ఎండిపోవడం, చెమట పట్టకుండుట, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలు.

జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు ఇలా..

తేదీ	ప్రాంతం	డిగ్రీలు
8న	ఆత్మకూరు	44.1
7న	చాగలమర్రి	45.8
6న	జి.ఉప్పలూరు	44.7
5న	ఆలమూరు	44.41
4న	మహానంది	44.1
3న	నందవరం	43.78
2న	చాగలమర్రి	43.8
1న	బనగానపల్లె	43.48



వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి.
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- రోజుకు 15 గ్లాసుల నీళ్లు తాగాలి.
- పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.
- భోజనం మితంగా తీసుకోవాలి.
- ఎండ వేళ ఇంటి పట్టును ఉండటం అన్ని విధాలా శ్రేయస్కరం.
- తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి తీసుకెళ్లాలి.
- మాంసాహారాన్ని దాదాపు తగ్గించాలి, మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి.

అప్రమత్తంగా ఉండాలి



వేసవికాలంలో ఎండలు తీవ్రతరం కావడంతో వడదెబ్బబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడదెబ్బ తగిలిన వారిలో 40 శాతం మంది మృత్యువాత పడే ఆస్కారం ఉంది. వృద్ధులు, చిన్న పిల్లలు ఎంతో అవసరమైతే తప్ప ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్లలో నుంచి బయటకు రావద్దు. వడదెబ్బకు గురి అయిన వ్యక్తికి తక్షణమే వైద్య సేవలు అందించడం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చు.

– చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ డాక్టర్, కోవెలకుంట్ల

పది మందికి అస్వస్థత



మహానంది: వడగాల్పులకు మండల కేంద్రమైన తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాలకు చెందిన పది మంది సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉపాధి పనులు, కూలీ పనులకు వెళ్లి డీహైడ్రేషన్‌కు గురైన బాధితులను వారి కుటుంబ సభ్యులు తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. డాక్టర్ భగవాన్ దాస్ ఆధ్వర్యంలో వారికి సెలైన్ బాటిళ్లు పెట్టి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ ఆయన మాట్లాడుతూ ఎండవేడిమి అస్వస్థతకు గురయ్యారన్నారు. పనులకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ మంచినీరు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

వేసవి పంటల ఈ - క్రాప్ నమోదు

నంద్యాల(సెంట్రల్): వేసవి పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఈ–క్రాప్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. సహజంగా మార్చి, ఏప్రిల్ నెలలో పంటల సాగు తక్కువగా ఉంటుంది. బావులు బోర్ల కింద అక్కడక్కడ కూరగాయలు, ఆరుతడి పంటలు సాగులో ఉన్నాయి. రెండు నెలల్లో సాగయ్యే పంటల విస్తీర్ణం నమోదు చేయడం ద్వారా సాగు విస్తీర్ణం, దిగుబడి పంటల స్థితిగతులను తెలుసుకునే అవకాశం ఉంది. ఈనెల 30 నాటికి ఈ–క్రాప్ నమోదు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు.

డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): నంద్యాల జిల్లా వ్యాప్తంగా 13 పశుసంవర్ధక ఆరోగ్య సేవ అంబులెటరీ సర్వీస్ (1962) డ్రైవర్ల (పైలెట్ల) పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా మేనేజర్ రామకృష్ణ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టులకు పదవ తరగతి చదివి, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, 36 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు డబ్ల్యూ.డబ్ల్యూ.ఏహెచ్‌డీ. జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. భవిష్యత్తులో డ్రైవర్ పోస్టులకు కొరత లేకుండా బఫర్ ప్రణాళికలో భాగంగా పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహానంది క్షేత్రంలో నేడు ఉగాది వేడుకలు

మహానంది: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మహానందిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు ప్రత్యేక అభిషేక, అర్చనలతో పాటు తిరుమంజన సేవ ఉంటుందన్నారు. స్వామి, అమ్మవారికి నింబ కుసుమ భక్షణ సమర్పణ చేసి భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తామన్నారు. సాయంత్రం ఐదు గంటలకు అభిషేక మండపంలో క్రోధినామ సంవత్సర పంచాంగ పూజ, నవగ్రహ పూజ అనంతరం పంచాంగ శ్రవణం ఉంటుందని చెప్పారు.

మహానంది ఉద్యోగులకు తీపి కబురు

- రూ.29.18 లక్షల డీఏ అరియర్స్ మంజూరు
- 52 మంది ఉద్యోగుల కుటుంబాలకు ఉగాది కానుక

మహానంది: మహానంది దేవస్థానం ఉద్యోగులకు ఉగాది పర్వదినం సందర్భంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తీపి కబురు అందించారు. మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం(డీఏ ఆరియర్స్) మంజూరు చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జూలై 2019 నుంచి జూన్ 2022 వరకు 36 నెలల డీఏ అరియర్స్ (కరవు భత్యం (5.24శాతం) రూ. 29,18,786 మంజూరు చేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని, ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి మేరకు ఉగాది కానుకగా మంజూరు చేశామన్నారు. ఈ మేరకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిశంకర అవధాని, ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, సభ్యులు లక్ష్మయ్య మాట్లాడుతూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక దేవస్థానం అభివృద్ధికి పాటుపడుతూనే ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నారన్నారు. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ తరఫున ఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొమ్మిది నెలల క్రితం ఉద్యోగులకు రావాల్సిన సంక్షేమ నిధి, పీఆర్‌సీ, ఇతర సదుపాయాలకు సంబంధించి రూ. 50 లక్షల వరకు చెల్లించడం విశేషం.

కనుల పండువగా ప్రభోత్సవం

- నంది వాహనంపై ఆది దంపతుల విహారం
- మహాసరస్వతి అలంకారంలో కటాక్షించిన భ్రామరి
- సంప్రదాయబద్ధంగా వీరాచార విన్యాసాలు
- నేడు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాగశ్రవణం
- నేడు రథోత్సవం


భ్రామరీ సమేత మల్లికార్జునుడికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


ఉత్సవంలో కళాకారుల సందడి


ప్రభోత్సవాన్ని తిలకిస్తున్న అశేష జనం (ఇన్‌సెట్లో) ప్రభపై కొలువైన స్వామి అమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరి క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడోరోజు సోమవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు నిర్వహించిన ప్రభోత్సవం నేత్రానందభరితంగా సాగింది. ఉత్సవాల్లో భాగంగా శ్రీభ్రమరాంబాదేవిని మహాసరస్వతి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను నంది వాహనసేవపై అలంకరించారు. ప్రత్యేక అలంకీకృతులైన మహాసరస్వతి అమ్మవారికి, నందివాహనాధీశులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు వాహనసేవ పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. చతుర్భుజాలు కలిగి ఉండి వీణ, అక్షమాల పుస్తకాన్ని ధరించిన ఈ దేవిని దర్శించడం వలన విద్యాప్రాప్తితో పాటు అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. అలాగే నందివాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన చేపట్టే పనుల్లో విజయం లభిస్తుందని, భోగభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. అనంతరం ఉత్సవమూర్తులను గంగాధర మండపం వద్ద ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన ప్రభపై ఉంచి అర్చకులు ప్రత్యేక పూజాహారతులు ఇచ్చారు. అనంతరం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు ప్రభోత్సవం కొనసాగింది. వేలాది మంది కన్నడ భక్తుల నీరాజనాల నడుమ ప్రభోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఏఈవోలు హరిదాసు, అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమావాస్య ఘడియలను పురస్కరించుకుని అగ్నిగుండప్రవేశం, వీరాచార విన్యాసాలు కొనసాగాయి. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్రవచనాలను పఠిస్తూ శూలాలు తదితర అస్త్రాలను తమ చెంపల్లోకి, నాలుకలలోకి, పెదవుల్లోకి, కడుపులోకి, చేతులకు కుచ్చుకున్నారు.


ఆకట్టుకున్న కళాకారుల వేషధారణ

నేడు పంచాంగశ్రవణం..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞచే పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వ హించనున్నారు. అలాగే సాయంత్రం స్వామిఅమ్మవార్లకు రథోత్సవాన్ని నిర్వహిస్తారు.

ముస్లిం మైనారిటీల పక్షపాతి వైఎస్ జగన్

- ఎమ్మెల్యేగా ఓడిపోయిన వెంటనే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు
- స్వలాభం కోసం పార్టీని వీడుతూ నిందలు వేయడం సిగ్గుచేటు
- ఎమ్మెల్సీ ఇక్బాల్‌పై మండిపడిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



నంద్యాల: ముస్లిం మైనార్టీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పార్టీ మారి వైఎస్సార్‌సీపీని విమర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్‌పై మండిపడ్డారు. శాసన మండలి సమావేశంలో చంద్రబాబునాయుడు గురించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఏం చేశారో మండలి సాక్షిగా ఇక్బాల్ ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలన్నారు. హిందూపూర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇక్బాల్ ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీ ఇచ్చారని, అనంతరం ఎమ్మెల్సీ పదవీ కాలం పూర్తి కాగా రెండోసారి ఆరు సంవత్సరాలు ఎమ్మెల్సీగా పదవి ఇచ్చిన విషయం మరిచిపోవద్దన్నారు. అందరికంటే ఎక్కువగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్బాల్‌నే అక్కున చేర్చుకున్నారని, ఈ రోజు ఏదో ఇబ్బంది కలిగిందని పార్టీ మారి వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం మంచిపద్ధతి కాదన్నారు. చంద్రబాబు అనుభవం ఉన్న నాయకుడు ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోరుకునే వ్యక్తి అని చెప్పడం చాలా విడ్డూరమన్నారు. బీజేపీతో కలిసిన చంద్రబాబుకు మద్దతుగా మాట్లాడటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీల గురించి మాట్లాడుతున్నావని, సీఎం వైఎస్ జగన్ వద్దకు అందరం కలిసి వెళ్లినప్పుడు మనకు మద్దతు ఇవ్వలేదా, అసెంబ్లీలో రిజల్యూయేషన్ పాస్ చేయించలేదా అని ప్రశ్నించారు. పార్టీ మారినంత మాత్రన స్వలాభం కోసం విలువలు విడిచి నిందలు వేయడం సిగ్గుచేటన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



నంద్యాల: ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సార్వత్రిక ఎన్నికల సమర్థవంత నిర్వహణకు సూక్ష్మస్థాయి ప్రణాళికతో పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల సంసిద్ధత, వడగాల్పులపై జిల్లా కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. కోడ్ అమలులో ఉన్నప్పటి నుంచి ఇప్పటివరకు 4.9 కోట్ల విలువైన నగదు, లిక్కర్, ఇతర వస్తువుల సీజ్ చేశామన్నారు. కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా రాజకీయ ప్రచారాలకు సంబంధించి అనుమతి కోసం ఇప్పటివరకు 529 దరఖాస్తులు అందగా 433 అనుమతులు మంజూరు చేశామని, 49 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. కోడ్ ఉల్లంఘనలో భాగంగా ఒక కాంటాక్ట్ ఎంప్లాయిని కూడా తొలగించడంతో పాటు రెగ్యులర్ ఎంప్లాయ్, ఒక టీచర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు 47 మంది రెగ్యులర్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఓటర్ల జాబితాకి సంబంధించి కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు దాదాపు 12,000 మంది పెరిగినట్లు తెలిపారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి...

నంద్యాల జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, ఉపాధి కూలీలు ఎండ తీవ్రత పట్ల జాగ్రత్తగా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. పట్టణాలలోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటుతో పాటు అత్యవసరమైన ప్రదేశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పెళ్లి కోసం డ్రా చేసిన డబ్బు అపహరణ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన బోయ కాశన్న తన కుమార్తె వివాహం కోసం దాచుకున్న రూ.3.20 లక్షలు నగదును గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అపహరించాడు. బాధి తుడు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి రూ.3.20లక్షల నగదు డ్రా చేసుకుని రోడ్డుపై వెళ్తుండగా వెనుకల నుంచి ఓవ్యక్తి స్ప్రే చల్లాడు. దీంతో కళ్లు, శరీరం మంటగా అనిపించడంతో తుడుచుకుంటుండగా నగదు సంచి లాక్కుని వెళ్లాడు. గట్టిగా కేకలు వేయడంతో వెంటనే అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి పిర్యాదు మేరకు సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రేమజంట బలవన్మరణం

- రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులు
- మంత్రాలయంలో విషాదం

మంత్రాలయం/ఆదోని సెంట్రల్: తమ ప్రేమకు పెద్దలు అడ్డుచెబుతారని అనుకున్నారో ఏమో.. ఓ యువతి, యువకుడు రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నారు. రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు... మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చాకలి చిన్న గోవిందు మొదటి భార్య ఏకైక కుమారుడు వెంకటేష్ (20), మంత్రాలయం మండల కేంద్రానికి చెందిన నందిని(19) అనే యువతి రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ప్రస్తుతం యువతి కర్నూలులో బీటెక్ చదువుతోంది. ఇంటర్ పూర్తిచేసుకున్న యువకుడు వచ్చే ఏడాది బీటెక్ చదవాలని భావించాడు. చదువుకున్న రోజుల్లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇష్టపడిన యువకుడు, యువతీ ఏమి ఆలోచన చేశారేమోగాని ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుంచి పారిపోయారు. తుంగభద్ర రైల్వే స్టేషన్‌కు చేరుకుని సమీపంలోని బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాలను గుర్తించిన గ్యాంగ్‌మ్యాన్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ గోపాల్ సంఘటన స్థలం చేరుకున్నారు. మృతదేహాలను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆదివారం వరకు తమతో ఉన్న వారు సోమవారం ఉదయం శవాలుగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




వెంకటేష్, నందిని (ఫైల్)

యువకుడి దారుణహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఓ యువకుడిని గుర్తుతెలియని దుండగులు దారుణంగా గొంతు కోసి హత్య చేశారు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. దేవనగర్ వీధికి చెందిన చోట ఇద్రూస్‌వలి, గౌసియాలు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సమీర్ (22) డోర్ పాలిష్ పని చేస్తూ సాయంత్రం చికెన్ పకోడి వ్యాపారం చేస్తున్నాడు. రంజాన్ మాసం కావడంతో సమీర్ ఇంటిపై ఒక్కడే పడుకుని తెల్లవారుజామున మసీదులో ప్రార్థనకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి యథావిధిగా చికెన్ పకోడి వ్యాపారం ముగించుకుని ఇంటి పైకి వెళ్లి నిద్రపోయాడు. సోమవారం ఉదయం సమీర్ తల్లి ఇంటి పైకి వెళ్లి చూడగా కుమారుడు రక్తపుమడుగులో విగత జీవిగా పడి ఉన్నాడు. గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా గొంతు భాగంలో పదునైన ఆయుధంతో నరికి హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి తండ్రి ఇద్రూస్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హత్యకు గల కారణాలు, నిందితుల వివరాల కోసం విచారణ చేపట్టారు.



మృతిచెందిన సమీర్ (ఫైల్)

ఇనుప ఖనిజం అక్రమ తవ్వకం

కర్నూలు (న్యూటౌన్): వెల్దుర్తి మండలం సర్పరాజపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 501, 448లో ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తవ్వి పెద్ద ఎత్తున నిల్వ చేసినట్లు తనిఖీల్లో వెల్లడైందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. వెల్దుర్తి మండలం బాలాపురం - రేపల్లె గ్రామాల మధ్యలో అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తవ్వి తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, పోలీసులు, గ్రామ రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేశారన్నారు. అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తవ్వి తరలించి పెద్ద ఎత్తున నిల్వ ఉంచారని విచారణలో తేల్చారన్నారు. సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై కేసు నమోదు చేస్తామన్నారు.

రింగుల బాషా కోసం వేట

కర్నూలు: మద్యం రవాణా 'రింగ్' మాస్టర్ చింపర్తి రింగుల బాషా కోసం వేట మొదలైంది. కర్నూలు శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారుల తనిఖీల్లో రూ.14.51 లక్షల విలువ చేసే 240 బాక్సుల మద్యం పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా అనుమానిస్తున్న చింపర్తి రింగుల బాషా కోసం కర్నూలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు వేట ముమ్మరం చేశారు. ఇందుకోసం ఎస్ఐ నేతృత్వంలో ఐదుగురితో కూడిన ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. ఈ కేసులో వాహన డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫిలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పడంతో జిల్లా జైలులో అప్పగించారు. మద్యం రవాణా ప్రధాన సూత్రధారి ఎ-3 నిందితుడుగా ఉన్న చింపర్తి రింగుల బాషా స్వగ్రామం కడప జిల్లా చాపాడు మండలం పల్లెవోలుకు చెందిన ఖాదర్‌పల్లె. రెండు రోజులుగా రింగుల బాషా ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుండటంతో నేరుగా అధికారులే రంగంలోకి దిగి అతని కోసం గాలిస్తున్నారు. అలాగే వాహన యజమాని హబీబుల్లా కోసం కూడా వేట మొదలైంది.

సాంకేతిక ఆధారాలు సేకరించిన ఇంటెలిజెన్స్ టీమ్

సార్వత్రిక ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో భారీ మొత్తంలో మద్యం పట్టుబడటంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో పాటు సెబ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధాన నిందితుడు చింపర్తి రింగుల బాషాపై గతంలో ఎర్ర చందనం, మద్యం అక్రమ రవాణాకు సంబంధించి 104 కేసులు ఉన్నాయి. ఆయా కేసుల్లో ఎన్నిసార్లు అరెస్టు అయ్యాడు? కేసులు ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే అందుకు కారణాలు తదితర అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. కొన్ని కేసుల్లో అరెస్టు చేయకపోవడానికి కారణాలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలోని శ్రీనివాస వైన్స్ పేరుతో బిల్లులు వేయించుకుని వనపర్తి ఐఎంఎల్ డిపోలో మద్యం లోడ్ చేసుకుని మైదుకూరు, ప్రొద్దుటూరుకు తరలిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఈనేపథ్యంలో రింగుల బాషాకు శ్రీనివాస వైన్స్ నిర్వాహకులతో ఎంతకాలం నుంచి వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి అనే కోణంలో కూడా విచారణ సాగుతోంది.

రింగుల బాషా కారులో కర్నూలుకు వచ్చినట్లు ఆధారాలు

వోక్స్ వ్యాగన్‌కు చెందిన కారులో రింగుల బాషా కర్నూలుకు వచ్చి సంతోష్ నగర్‌లో ఉండి మద్యం వాహనాన్ని జిల్లా సరిహద్దు దాటించేందుకు ప్రయత్నించినట్లు సెబ్ ఇంటెలిజెన్స్ టీమ్ ప్రాథమిక సాక్ష్యాధారాలను సేకరించారు. ఒప్పందం ప్రకారం డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీ కడప నుంచి బస్సులో వచ్చి పంచలింగాల టోల్‌ప్లాజా దగ్గర ఉండగా మద్యం లోడు లారీని వారికి అక్కడ అప్పగించి రింగుల బాషా కర్నూలు చేరుకున్నట్లు ఆధారాలు సేకరించారు. అయితే స్మార్ట్ ఫోన్‌కు బదులుగా కీప్యాడ్ ఫోన్ వాడినందున టవర్ లొకేషన్ ఆధారంగా అతనితో ఎవరెవరు ఉన్నారనే ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. రింగుల బాషాతో పాటు వాహన యజమాని హబీబుల్లా, డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీల ఫోన్‌లకు ఎవరెవరు మాట్లాడారు? ఈ ముఠా వెనుక ఇంకెవరైనా ఉన్నారా? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ఉన్న నలుగురు నిందితుల్లో ఫోన్‌పే యాప్ ఎవరెవరికి ఉంది? వారి ద్వారా ఎంత మొత్తంలో నగదు బదిలీ అయింది? ఎవరెవరికి బదిలీ చేశారు? అందులో వ్యాపార లావాదేవీలు ఏమైనా ఉన్నాయా? తదితర అంశాలపై కూడా పోలీసు, సెబ్ అధికారులు సాంకేతికత ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఓ ఆకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలుశిక్షను సోమవారం ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు. నంద్యాల పట్టణానికి మల్లెపోగుల నరేంద్రబాబు స్థానిక బాలాజీ కాంప్లెక్స్ ఏరియాలో దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రెండు రోజులు జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణానదిలో మునిగి హైదరాబాద్ వాసి మృతి



లింగాలగట్టులో మృతి చెందిన శశికాంత్

శ్రీశైలంప్రాజెక్ట్: ఉగాది మహోత్సవాలకు హైదరాబాద్ నుంచి శ్రీశైలం వచ్చిన ఓ వ్యక్తి కృష్ణానదిలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. హైదరాబాద్ సమీపంలోని బాలాపూర్‌కు చెందిన శశికాంత్ (43) ఇద్దరు మిత్రులతో కలసి ఆదివారం శ్రీశైలం చేరుకున్నారు. దైవదర్శనం అనంతరం సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో డ్యాం దిగువ భాగం లింగాల గట్టులోని హైలెవల్ ఘాట్ వద్ద మిత్రులతో కలిసి నదీ స్నానం కోసం దిగారు. కాగా శశికాంత్ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని అక్కడి మత్స్యకారులు ఒడ్డుకు చేర్చి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, ఎస్ఐ గంగయ్యయాదవ్ సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువతి

ఆదోని అర్బన్: ప్రియుడు పెళ్లికి నిరాకరించడతో ఓ యువతి బ్లేడ్‌తో చేయికోసుకుంది. టూటౌన్ సీఐ గోపి తెలిపిన మేరకు వివరాలు.. ఆదోని పట్టణం బండిమెట్ట కాలనీకి చెందిన గోవింద్, అదే కాలనీకి చెందిన ఓ యువతి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోను అన్నందుకు యువతి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. బ్లేడుతో చిన్నగా చేయిని కోసుకుందని సీఐ తెలిపారు. ఆమెను వెంటనే తమ సిబ్బందితో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించామన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి తెలియజేశారు. సోమవారం విజయవాడ నుంచి సీఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. కర్నూలు అర్బన్ ఎస్ఎస్ ట్యాంకు, గాజులదిన్నెలలో సరిపడా తాగునీరు ఉన్నాయన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు మండలాలకు ఒక ప్రత్యేకాధికారిని నియమించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ ఎస్ఈ ఉమాపతి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

- 40 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పద్మావతినగర్ నగర్ సమీపంలోని తేజ అపార్ట్‌మెంట్‌లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్ సుధీర్ తన కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. మంగళవారం ఉగాది పండుగ కావడంతో కుటుంబ సభ్యులంతా కొత్త బట్టలు కొనేందుకు సోమవారం షాపింగ్‌మాల్‌కు వెళ్లారు. ఇదే సమయంలో గుర్తుతెలియని ఇద్దరు దొంగలు అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి సుధీర్ ఫ్లాట్‌కు వేసిన తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళం తెరిచి అందులో ఉన్న సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సుధీర్ కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగిరాగానే తలుపులు తెరిచి ఉండటం, బీరువాలో వస్తువులు చిందరవందరగా పడిఉండటంతో స్థానిక టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడు సుధీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో ఉన్నారు.



బీరువాను తెరిచి నగలు అపహరించిన దృశ్యం

ఇద్దరు దొంగల అరెస్ట్....

నంద్యాల మండలం రైతునగరం గ్రామశివారులో ఉన్న భగత్‌సింగ్ కాలనీలో ఇటీవల చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను తాలుకా పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 30వ తేదీ రాత్రి భగత్‌సింగ్ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ఆదివారం ఆటోనగర్ సమీపంలో సుధాకర్, గణేష్ అనుమానాస్పదంగా కనిపించటంతో వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సోమవారం తెలిపారు.

మంత్రిగా చేసి సొంతూరుకు రోడ్డు వేయించలేదు

దొర్నిపాడు: మంత్రిగా పనిచేసిన అఖిలప్రియ ఆమె సొంతూరు డబ్ల్యూ. కొత్తపల్లెకు రోడ్డు కూడా వేయించలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన డబ్ల్యూ. కొత్తపల్లెలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా అభివృద్ధి జరిగిందన్నారు. జగనన్న పాలనలోనే చాకరాజువేముల నుంచి డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ. గోవిందిన్నె, కంపమల్ల మెట్ట నుంచి డబ్ల్యూ గోవిందిన్నె, ఎర్రగుంట్ల నుంచి డబ్ల్యూ. కొత్తపల్లెకు రహదారులు వేశారన్నారు. మంత్రిగా నియోజకవర్గాభివృద్ధిని విస్మరించిన అఖిలప్రియ ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. గ్రామంలో ప్రభుత్వ గోదాం నిర్మించేందుకు స్థలం ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రాకుండా అడ్డుకుంటే తానే సొంత స్థలం ఇచ్చినట్లు గుర్తు చేశారు. గ్రామం బాగు పడాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. మళ్లీ రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా వీరభద్రారెడ్డి, అంబటి మహేశ్వరరెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి

డిపాజిట్ చేసుకున్న తుపాకులను ఇప్పించండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోలీసులు డిపాజిట్ చేసుకున్న మాజీ సైనికుల తుపాకులను తిరిగి ఇప్పించాలని జాతీయ మాజీ సైనికుల సమన్వయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పీ శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ఫోర్సుల్లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన అనేక మంది మాజీ సైనికులు , బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ మాజీ జవాన్లు తమ తమ బతుకుదెరువు కోసం తుపాకులు తెచ్చుకొని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారన్నారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసు అధికారులు వారి తుపాకులను డిపాజిట్ చేసుకున్నారన్నారు. తుపాకులు వారి వద్ద లేకపోవడం వల్ల వారు ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ... వివిధ బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న మాజీ సైనికుల తుపాకులను తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 27వ తేదీన జీఓఆర్‌టీ నెంబర్: 422 జారీ చేసిందన్నారు. అయితే పోలీసులు మాత్రం తమ వద్ద డిపాజిట్ చేసుకున్న మాజీ సైనికుల తుపాకులను అందించడం లేదన్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన దృష్టికి కూడా తీసుకుపోయామన్నారు.వెంటనే మాజీ సైనికుల తుపాకులను వాపసు చేసే విధంగా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

మద్యం అక్రమ రవాణాకు సహకరిస్తే ఊరుకోం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సెబ్ అధికారులకు డీఐజీ విజయరావు హెచ్చరిక

కర్నూలు: మద్యం అక్రమ రవాణాదారులకు కొంత మంది సెబ్ సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, విచారణలో నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు తప్పవని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు హెచ్చరించారు. కర్నూలులోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేయడం ద్వారా మద్యం, డబ్బు, కానుకలు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి అయ్యే అవకాశమున్నందున డంపుల పైన దృష్టి సారించి దాడులు చేయాలని ఆదేశించారు. అలాగే నాటుసారా, మద్యం రవాణాపై కూడా నిఘా పెంచాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో రూట్ వాచ్‌లు ముమ్మరం చేయాలన్నారు. చెక్‌పోస్టులలో వసతులను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమకూర్చుకోవాలన్నారు. రేంజ్ పరిధిలోని అడిషనల్ ఎస్పీలు నాగరాజు, రాముడు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్లు రవికుమార్, రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులు నాయుడు, ఏఈఎస్‌లు వినోద్‌కుమార్ నాయక్, రవితో పాటు నాలుగు జిల్లాల సెబ్ సీఐలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.